శుక్రవారం । 14 । మార్చి । 2025
హైదరాబాద్ । www.sakshi.com

# నైపుణ్యాల పెంపులో విద్యాసంస్థల పాత్ర కీలకం

## ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి



సాక్షి, హైదరాబాద్: సరళీకృత, ప్రపంచీకరణ విధానాల కారణంగా మన విద్యాసంస్థలు ఇతర దేశాలతో కలసి పనిచేయడం సాధ్యమైందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి అన్నారు. గురువారం బ్రిటిష్ డిప్యూటీ హైకమిషన్, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. యూకే, తెలంగాణ విశ్వవిద్యాలయాల ప్రతిని ధులు పరస్పర విద్యా విధానాల్లో ఉన్న అత్యుత్తమ పద్ధతులతో, సహకార అవకాశాలను అన్వేషించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం భారత ఆర్థిక ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తోందని, ఈ నేపథ్యంలో నైపుణ్య మానవ వనరులను తయారు చేయడంలో విద్యా సంస్థలు ముఖ్యమైన పాత్ర పోషించాలని పేర్కొన్నారు. బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ (తెలంగాణ, ఏపీ) గారెత్ విన్ ఓవెన్ మాట్లాడుతూ విద్యారంగంలో పురోభివృద్ధికి యూకే, తెలంగాణ కట్టుబడి ఉన్నాయన్నారు. తెలంగాణలోని ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, బ్రిటన్ విశ్వవిద్యాలయాల మధ్య భాగస్వామ్యాలను అన్వేషించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

హైదరాబాద్ • శుక్రవారం 14 మార్చి 2025

ఆంధ్రజ్యోతి

# ఐదేళ్లలో బీటెక్, ఎంఎస్

- ఇంటిగ్రేటెడ్ ట్విన్నింగ్ ప్రోగ్రామ్‌ను ఆఫర్ చేస్తున్న 'హితమ్'
- మూడు అమెరికన్ యూనివర్సిటీలతో అవగాహన ఒప్పందం
- జేఎన్‌టీయూ నుంచి బీటెక్, అమెరికన్ వర్సిటీల నుంచి ఎంఎస్ డిగ్రీలు



ఎంఓయూ పత్రాలను చూపుతున్న అమెరికన్ యూనివర్సిటీ, హితమ్ కళాశాల ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, మార్చి13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (హితమ్) 2025-26 విద్యా సంవత్సరం నుంచి సరికొత్త ఇంటిగ్రేటెడ్ ట్విన్నింగ్ ప్రోగ్రామ్‌ను ఆఫర్ చేస్తోంది. ఆరేళ్ల పాటు చదవాల్సిన బీటెక్, ఎంఎస్ డిగ్రీలను ఐదేళ్లలోనే పూర్తిచేసే అవకాశం లభిస్తుండడంతో సమయంతో పాటు ఖర్చు కూడా తగ్గనుంది. ఫలితంగా బీటెక్‌తో పాటు ఎంఎస్ డిగ్రీలను పొందేందుకు వీలుకానుంది. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ అలబామా, మిల్‌వాకే స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్, జార్జ్ మాసన్ యూనివర్సిటీలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని హితమ్ కళాశాల డైరెక్టర్ సోహం సాహోనీ తెలిపారు. గురువారం గోల్కొండ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ట్విన్నింగ్ ప్రోగ్రామ్‌లో చేరిన విద్యార్థులు తమ బీటెక్‌లోని తొలి మూడేళ్లు హితం కళాశాలలో, ఒక సంవత్సరం బీటెక్, మరో ఏడాది ఎంఎస్ (మాస్టర్ ఆఫ్ సైన్స్)ను వారు కోరుకున్న అమెరికన్ యూనివర్సిటీల్లో పూర్తి చేస్తారని పేర్కొన్నారు. ఇంటర్, తత్సమాన విద్యార్హత కలిగిన విద్యార్థులు ఈ ప్రోగ్రామ్‌లో చేరేందుకు అర్హులని, జేఈఈ మెయిన్స్, బిట్‌శాట్ వంటి పోటీ పరీక్షల్లో తెచ్చుకున్న ర్యాంకుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని తెలిపారు. మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను కూడా అందజేస్తామని చెప్పారు.

## గ్లోబల్ పార్టనర్‌షిప్‌తో ఎంతో మేలు

ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ ఆధునిక విద్యా విధానాలను అందిపుచ్చుకోవడంలో హితమ్ కళాశాల ముందు వరుసలో ఉందని, రాష్ట్రంలోని ఇతర విద్యాసంస్థలు కూడా ఇదే మార్గంలో నడవాలని ఆకాంక్షించారు. నాస్కామ్ మాజీ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంఎస్ కోసం వస్తున్న విద్యార్థులకు ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్‌తో పాటు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించాలని అమెరికన్ యూనివర్సిటీల ప్రతినిధులకు సూచించారు.

కార్యక్రమంలో హితమ్ కాలేజీ చైర్మన్ ఆరుట్ల ప్రశాంత్, మాజీ డైరెక్టర్ సంజయ్ దాండే, ప్రిన్సిపాల్ అరవింద్, జేఎన్‌టీయూ నుంచి రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, డైరెక్టర్ రవీంద్రారెడ్డి, అమెరికన్ యూనివర్సిటీల ప్రతినిధులు జాన్ హక్కిలా, రూత్ భరత్, ఎరిక్ బామ్‌గార్డ్‌నర్, రోబ్ పెటిట్ తదితరులు పాల్గొన్నారు.